


## స్విమ్స్, రుయాలో ఆరోగ్యశ్రీ వార్డుల పరిశీలన

**ప్రజాశక్తి - తిరుపతి సిటి**



ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈఓ డాక్టర్ జి. లక్ష్మీ శ తిరుపతి జిల్లా స్విమ్స్ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వార్డ్, ఐసియు వార్డులో చికిత్స పొందుతున్న ఆరోగ్యశ్రీ రోగులను పరామర్శించారు. ఆరోగ్యశ్రీ సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులు ఆరోగ్య శ్రీ సేవలు ఉచితంగా అందుతున్నాయని సీఈఓకి వివరించారు. జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా మేనేజర్ శివకుమార్ సీఈఓ వెంట ఉన్నారు. అనంతరం రుయా ఆస్పత్రిని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న సర్జరీ రోగులను విచారించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, డీఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీహరి, డిప్యూటీ కలెక్టర్ భాస్కర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## టెక్నో, ఈటెక్నో, ఐఐటి కోచింగ్‌ల పేరుతో...
# 'తోకల' బిజినెస్



### సిబిఎస్ఇ సిలబస్ అంటూ అదనం
### ఫీజు నియంత్రణ పట్టని అధికారులు
### పేరెంట్స్ కమిటీలపై మీనమేషాలు

**ప్రజాశక్తి- తిరుపతి**

సిబిఎస్ఇపై మోజు, కార్పొరేటు స్కూళ్లపై వ్యామోహంతో ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తున్నారు. ఇదే అదనుగా భావించి ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు స్కూల్ పేర్ల చివరన టెక్నో, ఈ టెక్నో, ఐఐటి, ఒలంపియాడ్, మోడల్, డిజిటల్, ఇంటర్నేషనల్, కాన్సెప్ట్ అంటూ తోకలు చేర్చి మరీ విద్యార్థుల తల్లిదండ్రులను బోల్తా కొట్టిస్తున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ పేర్ల చివర కేవలం ప్రైవేటు అనే ఉండాలి. తోక పేర్లు ఉండొద్దని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. ఇప్పటికీ అనేక బడులకు తోకపేర్లు దర్శనమిస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని స్కూళు బయట బోర్డు, బస్సులపై తొలగించినా, పేరెంట్స్‌కు పంపించే లెటర్లు, స్టూడెంట్స్ బుక్స్‌లో అవే దర్శనమిస్తున్నాయి. ఈ పేర్లతోనే కార్పొరేట్ మేనేజ్మెంట్లు పేరెంట్స్ నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

**ఫీజులపై నియంత్రణేదీ?**

ఫీజుల నియంత్రణలోనూ ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అయితే నిబంధనలను పక్కన బెట్టి ఈ విద్యాసంవత్సరాని (2024-25)కి గాను పలు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు భారీగా పెంచాయి. ప్రస్తుతం ఉన్న ఫీజుల కంటే 15 నుంచి 20శాతం వరకు పెంచినట్లు విద్యార్థి సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. సీబీఎస్ఈ సిలబస్ అంటూ ఈ ఏడాది (2024-25) 1వ తరగతి నుంచి 3వ తరగతి వరకు రూ.70వేల నుంచి రూ.90వేలు, 4వ తరగతి నుంచి 6వ తరగతి వరకు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, రూ.80 వేలు నుంచి లక్షా ఇరవై వేల వరకు ఫీజులు వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. మంగళంలో ఇటీవలే ఏర్పాటు చేసిన ఓ ప్రముఖ సిబిఎస్ఇ విద్యాసంస్థలో టర్మ్ ఫీజులను వసూలు చేసి మరీ అడ్మిషన్లను ముగించేయడం గమనార్హం. ప్రతిఏడాది ఆయా పాఠశాలల యాజమాన్యాలు 20 శాతం నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచుతూనే ఉన్నా విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పేరెంట్స్ కమిటీలపై మీన మేషాలు**

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల విషయంలో సరైన నియంత్రణ లేకపోవడంవల్ల పాఠశాలల యాజమన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఫీజుల విషయంలో ఈ కమిటీ నిర్ణయం తీసుకోవాలి. అలాంటిది ఏ ఒక్క పాఠశాలలో అమలు కావడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల విషయంలో ఒక్కసారి కూడా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ సారైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పేరెంట్స్ కమిటీలను పటిష్టంగా అమలు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.




## ఫలితాలు వెలువడకనే..
# అధికారుల పా(ఫ)ట్లు

### వైసిపి అనుకూలురులో గుబులు/ప్ర(డి)మోషన్ల ఊగిసలాట

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

వచ్చే నెల నాలుగో తేదీ ఫలితాలు వెలువడనున్నాయి. వైసిపి అధికారంలోకి వస్తే సరి.. ఒకవేళ రాష్ట్రంలో టిడిపి కూటమి వస్తే ఎలా?.. అనే ఊహ అధికారులను నిద్రపోనివ్వడం లేదు. ఫలితాలు రాకముందే కొంతమంది సర్దుకుంటుంటే, వైసిపి అనుయాయులుగా ముద్రపడిన అధికారుల్లో మాత్రం గుబులు నెలకొంది. వీరి పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా తయారయ్యింది. తిరుపతి జిల్లాలో వివిధ శాఖల్లో ఎక్కువ కాలం పనిచేసిన అధికారుల బదిలీ తప్పదన్న చర్చ మొదలయ్యింది.

తిరుపతి జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో వైసిపికి వంతపాడిన వారిని ఇప్పటికే కూటమి అభ్యర్థులు గుర్తించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వీరిపై కక్షసాధింపు చర్యలు ఉంటాయన్న చర్చ నడుస్తోంది. ముఖ్యంగా పోలీసులపై తప్పకుండా యాక్షన్ ఉంటుందని తెలుస్తోంది. తిరిగి వైసిపి అధికారంలోకి వస్తే ఈ అధికారులకు ప్రమోషన్లు ఉంటాయి. టిడిపి కూటమి వస్తే మాత్రం డిమోషన్ తప్పనిసరి. వైసిపి పాలనలో అనేకమంది అధికారులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడటమే కాకుండా, నిబంధనలు తుంగలో తొక్కారన్న విమర్శలున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్లుగా పనిచేసిన వారు తిరుపతి, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, టిటిడి, ఆర్డీవో, డిఆర్ఓ, సివిల్ సప్లై, రెవెన్యూ, సబ్ రిజిస్ట్రేషన్, పోలీసు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, అటవీశాఖ, చిన్న నీటిపారుదల శాఖ, పంచాయతీలు, ఎంపిడిఓ .. ఇలా ఐదేళ్లుగా అధికారులుగా పనిచేస్తూ వైసిపికి వంతపాడుతూ వచ్చారు.

టిడిపి, జనసేన, బిజెపికి వ్యతిరేకంగా పనిచేసిన అధికారులు కొందరిని సస్పెండ్ చేయడమే గాకుండా మరికొందరిని నిరుపయోగంగా ఉన్న శాఖలకు బదిలీ చేయాలని ఇప్పటికే యాక్షన్ ప్లాన్ రెడీ అయినట్లు సమాచారం. పోలీసు, కార్పొరేషన్, రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, టిటిడి, ఎస్వీ యూనివర్సిటీలలో భారీగా ప్రక్షాళన జరగనుంది. కలెక్టరేట్‌లోనూ భారీగానే మార్పులు చేర్పులు జరిగే అవకాశం లేకపోలేదు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో మాస్టర్‌ప్లాన్ రోడ్ల పేరుతో టిడిఆర్ బాండ్ల జారీలో భారీఎత్తున అవినీతి జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో అన్ని గ్రామాలనూ అభివృద్ధి చేయాల్సింది పోయి, కేవలం చంద్రగిరి నియోజకవర్గంలో మాత్రమే తుడా నిధులు వెచ్చించారని, అందులోనూ అవినీతి పెద్దఎత్తున జరిగిందని కూటమి నేతలు భావిస్తున్నారు. తిరుపతి డికెటి భూములపైనా ఓ కన్నేసి ఉంచారు. టిటిడిలో భారీ ఎత్తున ఇంజినీరింగ్ విభాగంలో టెండర్లలో అవినీతి చోటుచేసుకుందని, పర్సంటేజీలతోనే ఈ ఎన్నికల్లో ఖర్చు పెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే అభ్యర్థుల గెలుపోటములపై అధికారులే భారీస్థాయిలో బెట్టింగులు నిర్వహిస్తుండటం గమనార్హం.

## 'సాయిజ్యోతి'లో కార్పొరేట్ స్థాయి బోధన




**ప్రజాశక్తి తిరుపతి సిటి**

కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఎస్ఎంఆర్ వారి సాయిజ్యోతి హైస్కూల్‌లో విద్యాబోధన అందిస్తున్నట్లు ఆ స్కూల్ కరస్పాండెంట్ కుంట్రపాకం సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. స్థానిక తిరుచానూరు రేణిగుంటరోడ్డు వద్దనున్న ఆ స్కూల్ ప్రాంగణంలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం స్థాపించిన తమ విద్యాసంస్థలు అంచెలంచెలుగా ఎదుగుతూ వేలాది మంది విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తును అందించేందుకు తోడ్పడిందన్నారు. తమ వద్ద చదువుకున్న సుమారు 25 మంది విద్యార్థులు విదేశాల్లో ఉన్నత స్థానంలో స్థిరపడ్డారని తెలిపారు. గత 29 సంవత్సరాల్లో తమ వద్ద చదువుకున్నవారిలో 700 మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, 20 మంది డాక్టర్లు, 10 మంది చార్టర్డ్ అకౌంటెంట్స్‌గా స్థిరపడ్డారని పేర్కొన్నారు. ఒక ఇల్లు నిర్మించడానికి ఎంత గట్టి పునాది అవసరమో అలాగే విద్యలో కూడా అలాంటి పునాది వేయగల సత్తా, సమర్థత ఎస్ఎంఆర్ వారి సాయిజ్యోతి హైస్కూల్‌కే సాధ్యమని తమ వద్ద చదువుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ప్రశంసలు రావడం ఆత్మసంతృప్తిని అందించిందన్నారు. విద్యాసంస్థను స్థాపించి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తాము తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు, తిరుమల వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మరో 20 సంవత్సరాలు నడిపి, స్వర్ణోత్సవం జరుపుకోవలనే ఉద్దేశంతో ముందుకెళ్లతున్నామన్నారు. 2024 ఎస్ఎస్‌సి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ఆర్.దిలీప్‌కుమార్ 573/600, ఎన్.బార్గవి 548, ఎం.నిహారిక 533 మార్కులతో స్కూల్ టాపర్లుగా నిలిచారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. వారికి సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9849944952 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.




**ప్రత్యేకతలు.....**

- ప్రశాంత వాతావరణంలో సువిశాలమైన భవనం.
- అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన.
- తక్కువ ఫీజుతో కార్పొరేట్‌స్థాయి విద్య.
- విద్యార్థుల ప్రగతిని ప్రతినెలా తల్లిదండ్రులకు తెలియజేసి ప్రత్యేక శిక్షణ.
- స్పోకెన్ ఇంగ్లీషులో విద్యార్థులు పట్టు సాధించేందుకు ప్రత్యేక క్లాసులు.
- పాఠ్యాంశాల్లో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం.

## కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి : ఆర్కాట్ కృష్ణప్రసాద్

**ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)**

గతంలో తిరుపతి ఎంఎల్ఎ స్థానం ఎన్నికల కౌంటింగ్ రోజు టిడిపి అభ్యర్థి సుగుణమ్మ గెలిచిందనుకుంటున్నా, చివరి ఘడియల్లో వైసిపి గెలిచినట్లు ప్రకటించడం వెనుక లోగుట్టు పెరుమాళ్లకెరుక అని కాపుసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. ఈసారి కౌంటింగ్ రోజు ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఈసారి కూటమి గెలుపు ఖాయమన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బెల్లంకొండ సురేష్, బండ్ల లక్ష్మీపతి, నీలాద్రి, గుండాల వేణు, రఘురాయల్ పాల్గొన్నారు.

## ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులుగా ప్రవీణ్

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**



ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులుగా తిరుపతికి చెందిన ఎలమంచిలి ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఆ సంఘం సర్వసభ్య సమావేశం సందర్భంగా ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికలు పరిశీలకులుగా మస్కట్ దేశం నుండి షకీల్ నలాకట్ విచ్చేసి సర్వసభ్య సమావేశాన్ని, ఎన్నికలను నిర్వహించారు. అన్ని రాష్ట్రాల ప్రతినిధులు, అధ్యక్ష, కార్యదర్శులు విచ్చేసి కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం 2024 నుండి 2028 వరకు కొనసాగనుంది. ప్రవీణ్ మాట్లాడుతూ ఇప్పటివరకు దాదాపు 206 ఆర్గనైజేషన్లలో సేవ చేసే భాగ్యం తనకు దొరికిందని, కొత్తగా గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యవర్గం తనను ఎన్నుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అభివృద్ధికి నిరంతరం కషి చేస్తానని అన్నారు.

# శాంతిభద్రతలే లక్ష్యం

### అర్బన్ ఎస్‌పి విష్ణువర్ధనరాజు

ఇంటర్వ్యూ

**ప్రజాశక్తి - తిరుపతి సిటి**



ఎన్నికల ఫలితాల రోజు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా, శాంతిభద్రతలే లక్ష్యంగా పోలీసు సిబ్బంది పనిచేయనున్నట్లు అర్బన్ ఎస్‌పి విష్ణువర్ధనరాజు చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల్లో నాలుగంచెల భద్రత ఏర్పాటు చేసి అప్రమత్తతతో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ రోజు, మరుసటి రోజు జిల్లాలో చోటు చేసుకున్న ఘటనలపై ఉదాసీనంగా వ్యవహరించారన్న ఆరోపణలతో జిల్లా ఎస్‌పి కృష్ణకాంత్ పటేల్‌ను, వెస్ట్ డిఎస్‌పి సురేంద్రరెడ్డిలను కేంద్ర ఎన్నికల సంఘం బదిలీచేసి, శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో కౌంటింగ్ రోజు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి శాంతిభద్రతలే లక్ష్యంగా పనిచేయాలని విష్ణువర్ధనరాజు సిబ్బందికి ఆదేశాలిచ్చారు. కౌంటింగ్ కౌంట్‌డౌన్ ప్రారంభించిన తరుణంలో పోలీసు సిబ్బంది తీసుకున్న చర్యలను వివరించారు. ఆయన మాటల్లోనే..

ప్రస్తుత పరిణామాల నడుమ బాధ్యతలు తీసుకోవడం సవాలుతో కూడుకున్న విషయం. అయినప్పటికీ ప్రణాళికాబద్ధంగా అధిగమించి పనిచేస్తాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా జరిపించడమే మా ముందున్న ప్రస్తుత కర్తవ్యం. తగిన బందోబస్తు ఏర్పాటు చేసుకుని సమర్థవంతంగా అమలు చేస్తాం. ఈ మధ్య జరిగిన ఘటనల నుంచి గుణపాఠాలు నేర్చుకుని అప్రమత్తంగా ఉంటూ, ఉత్తమమైన పనితీరుతో ప్రజల విశ్వాసాన్ని చూరగొంటాం. పోలీసు శాఖ ప్రతిష్టను పెంపొందించేలా పనిచేస్తాం. పోలింగ్ ప్రక్రియ ముగిసింది. కౌంటింగ్ మాత్రమే మిగిలింది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు సంయమనం పాటించాలి. ఆధ్యాత్మిక ప్రాంతంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలి. విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిడులు ఎదురైనా ప్రజలు, మీడియా, ప్రజాప్రతినిధులను సమన్వయపరచుకుంటూ మా పనితీరు మెరుగుపరచుకుంటాం. సమర్థవంతంగా విధులను నిర్వహిస్తాం. శాంతిభద్రతలను కాపాడతాం. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను వారం రోజుల పాటు నిర్వహించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించాం. ప్రశాంత వాతావరణంలో, వేడుకగా అమ్మవారి జాతర ముగియడంలో పోలీసుల పాత్ర కీలకం. జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లను ఇప్పటికే ఆకస్మిక తనిఖీలు చేశాం. పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు ఘటనలు జరిగిన ప్రాంతాల్లో పర్యటించి, దాన్నిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాం. కౌంటింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో నాలుగంచెల భద్రత ఏర్పాటు చేశాం.

## యథేచ్ఛగా మట్టి అమ్మకాలు

**ప్రజాశక్తి - సత్యవేడు**

సత్యవేడు మండలంలో కేవలం ఒకరిద్దరు అధికారులను మన వైపు మళ్లించుకుంటే (మామూలు ఇచ్చి) చాలు... ఒక్క రాత్రికి ఏకంగా 75 వేలు, ఒక్క పగలు చెరువు నుంచి ట్రాక్టర్ ద్వారా మట్టిని తరలిస్తే...1.50 లక్షలు సులువుగా జేబులో వేసుకోవచ్చు.. ఇది సత్యవేడు మండలంలో మట్టి అమ్మకాల ఆదాయాలు. తెలుగు గంగ మట్టి, చెరువుల్లో బంక మట్టి, మేత బీడు భూముల్లో ఉన్న కులక మన్ను యథేచ్ఛగా తరలిస్తున్నా సత్యవేడు మండలంలోని రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖ, తెలుగు గంగ అధికారులు కళ్లకు గంతలు కట్టుకోవడం పరిపాటిగా చెప్పవచ్చు.. కొల్లడం గ్రామం శ్రీ సిటీ పరిధికి ఆనుకొని ఉన్న అక్కడ చెరువులో మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. తాము కేవలం ఎన్నికల కోసం వచ్చామని, ఈ అక్రమ రవాణాపై తమకెందుకు? అన్నట్లుగా అధికారుల వ్యవహారశైలి ఉంది.




# నత్త నడకన 'శెట్టిపల్లి' అభివృద్ధి

### తెలుగుగంగ లీకేజీలు యథాతథం
### విద్యుత్ లైన్లు లాగని గుత్తేదారు
### రహదారి పనుల్లోనూ తీవ్ర జాప్యం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

దశాబ్దాల కాలంగా రేణిగుంట నుండి కరకంబాడి మార్గానికి చేరుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల నుండి నేడు కరకంబాడి మార్గంలోని రవాణా శాఖ కార్యాలయం నుండి శెట్టిపల్లి రైల్వే గేట్ వరకు నిర్మిస్తున్న 80 అడుగుల రోడ్డు మార్గం పనులు నత్తనడకన జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా లోతట్టు ప్రాంతాలను గ్రావెల్తో నింపుతూ పనులలో వేగం పెంచుతున్నా, ఈ మార్గంలో విద్యుత్ లైన్లు లాగని పరిస్థితి. ఈ రహదారి ఏర్పాటుకు తెలుగు గంగ పైప్ లైన్ లీకేజీ వలన కొంతకాలం ఆలస్యం అయిన విషయం విదితమే. అయితే తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులు దశలవారీగా లీకేజీలను అరికట్టడానికి గేట్‌వాల్ లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కారణం చేత కూడా రోడ్డు మార్గం నిర్మాణంలో ఆలస్యం జరుగుతోంది.

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్‌గా ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి ప్రతిపాదనతో మంగళం రవాణా శాఖ కూడలి నుండి శెట్టిపల్లికి సరైన రోడ్డు మార్గం నిర్మాణానికి సహకారం ఏర్పడింది. గత ఏడాది డిసెంబర్ మాసంలో జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో ఈ మేరకు 2.90 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం 15.12 కోట్ల రూపాయల నిధుల అంచనాతో రోడ్డు మార్గం ఏర్పాటుకు



అంగీకారం తెలిపింది.

**ప్రారంభంలో తెలుగుగంగ లీకేజీలు....**


మంగళం రవాణా శాఖ కూడలి నుండి శెట్టిపల్లి రైల్వే గేట్ వరకు నిర్మించ తలపెట్టిన 80 అడుగుల రోడ్డు నిర్మాణానికి ఈ మార్గంలో ఉన్న తెలుగు గంగ లీకేజీలు పెద్ద అడ్డంకిగా మారాయి. త్వరతగతిన రోడ్డు మార్గం నిర్మించడానికి గుత్తేదారు పలుమార్లు తెలుగు గంగ అధికారులకు సమస్యను వివరించారు. తెలుగు గంగ అధికారులు లీకేజీలున్న ప్రాంతాలను గుర్తించి లీకేజ్ లకు దశలవారీగా పరిష్కారాలు చూపుతున్నారు.

**విద్యుత్ పోల్స్ నిర్మాణ గుత్తేదారు నిర్లక్ష్యం..**

గత ఏడాది డిసెంబర్లో రోడ్డు పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం, టీటీడీ, తుడా అధికారులు సమన్వయంతో మంగళం రవాణా శాఖ కూడలి నుండి శెట్టిపల్లి రైల్వే గేటు వరకు ఈ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రోడ్డు వెడల్పు, పొడవు, కల్వర్టులు అన్నింటినీ సర్వే చేశారు. అయితే రోడ్డు నిర్మాణ పనులలో భాగంగా ఈ మార్గంలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటుకు టిటిడి నుండి టెండర్ దక్కించుకున్న గుత్తేదారు విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసి నెల రోజులు అవుతున్నా లైన్లను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగా దశాబ్దాల కల శెట్టిపల్లి మార్గం ఇప్పట్లో అందుబాటులోకి వచ్చేలా కనిపించడం లేదు. అధికారులు ఇకనైనా గుత్తేదారులను సమన్వయ పరిచి పనులలో వేగం పెంచి శెట్టిపల్లి మార్గాన్ని అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# ఫలితాలపైనే అందరి దృష్టి




**ప్రజాశక్తి - డక్కిలి**

ఎన్నికల ఫలితాలకు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో 9 రోజులలో ఫలితాలు వెలువడనున్నాయి. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మే 13న పోలింగ్ జరిగింది. జూన్ 4వ తేదీన ఓట్లను లెక్కించనున్నారు. ఆ ఎన్నికల ఫలితాల కోసం నాయకులతోపాటు ఆయా పార్టీల కోసం పనిచేసిన ద్వితీయ శ్రేణి నాయకులతోపాటు, కార్యకర్తలు నియోజకవర్గ ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. సరిగ్గా ఇంకో 9 రోజులు ఎదురుచూడక తప్పడం లేదు. వెంకటగిరిలోని తెలుగుదేశం, వైసిపి క్యాడర్ ఏ చోట కలిసినా ఎన్నికల ఫలితాలు పై చర్చలు సాగుతున్నాయి. నాయకుడు గెలిచి , పార్టీ ఓడితే ఏం చెయ్యాలి? ఏంపనులు చేసుకోవాలి? ఒక వేళ నాయకుడు ఓడి పార్టీ గెలిస్తే పరిస్థితి ఏంటి? నాయకుడు ఓడి, పార్టీ కూడా ఓడిపోతే ఎదుటి పార్టీ స్పీడును ఎలా తట్టుకోవాలి?. ఒక వేళ నాయకుడు గెలిచి పార్టీ కూడా గెలిస్తే. ఎలాంటి పనుల కోసం నాయకుడి వద్దకు వెళ్ళాలి? ఇవే ఆలోచనలతో క్యాడర్ సతమతమవుతున్నారు. అదేమి అభ్యర్థులకు రాని ఆలోచనేమీ కాదు. కానీ అన్నింటికీ టైమ్ రావాలి. జూన్ 4 రావాలి. ఆ రోజున మన వెంకటగిరి లెక్క తేలాలి. మన రాష్ట్రం లెక్క తేలాలి ... అంటూ కబుర్లతో ఇరు పార్టీల క్యాడర్లు కాలాన్ని భారంగా వెళ్లదీస్తున్నారు. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అధికంగా పోలయ్యాయి. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ సంస్థల ఉద్యోగులు జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఇవ్వడంతో అవకాశాన్ని వారు వినియోగించుకున్నారు. ఇక 85 ఏళ్లు దాటిన వయోవద్ధులతోపాటు దివ్యాంగులకు హెూం ఓటింగ్ అవకాశం కల్పించారు. ఇవన్నీ లెక్కించిన తర్వాతే ఈవీఎం మిషన్‌లోని ఓట్లు లెక్కిస్తారు. ఫలితంగా తొలి రౌండు ఫలితాలు వచ్చేసరికి జాప్యం జరిగే అవకాశం ఉందని అధికారులు తెలియజేస్తున్నారు.

**హోరెత్తనున్న ఎగ్జిట్ పోల్స్...**

జూన్ 1తేదీ సాయంత్రం 6.30 గంటల నుంచి టీవీ చానళ్ళు, పత్రికలు, సోషల్ మీడియా వేదికల మీద ఎగ్జిట్ పోల్స్ హోరెత్తనున్నాయి. ఎన్నికల సంఘం ఏప్రిల్ 19 నుంచి జూన్1 సాయంత్రం వరకు 7 విడతల్లో లోక్ సభతో పాటు కొన్ని రాష్ట్రాల్లో శాసనసభలకు ఎన్నికలు నిర్వహిస్తున్నందున ఎలాంటి ఎగ్జిట్ ఫలితాలను వెల్లడించ కూడదని మీడియా సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో జూన్ 1వ తేదీ సాయంత్రానికి ఎన్నికల సంఘం గడువు ముగియనుంది. ప్రతి మీడియా సంస్థ తాను వెల్లడించే ఎగ్జిట్ ఫలితాలకు ఎక్కువగా విశ్వసనీయత దక్కేలా జాగ్రత్తలు తీసుకుంటాయి. ఏ రాజకీయ పార్టీని మెప్పించే ప్రయత్నాల్లోకి వెళ్ళకుండా జనాభిప్రాయం ఆ రోజున ఎలా వుంటే అలా చెప్పడానికి ప్రయత్నాలు చేస్తుంటాయి. అందుకే ఎలాంటి తప్పటడుగులు వేసినా ప్రజల్లో తమ సంస్థకు ఉన్న క్రెడిబిలిటీ దెబ్బతినే ప్రమాదం వుందని భావించి చాలా జాగ్రత్తలు తీసుకుంటాయి. ఒక్కో సంస్థ నెట్వర్క్, సేకరణలో శాస్త్రీయత, సరైన విధంగా సాంకేతికత వినియోగించి ప్రజల భావోద్వేగాలను పసిగట్టి విశ్లేషించి అంచనాలన్నింటిని క్రోడీకరించి ఎగ్జిట్ పోల్స్ గా వెలువరిస్తాయి. దీంతో ఎగ్జిట్ పోల్స్ ఆధారంగా జూన్ ఒకటో తేదీ సాయంత్రానికి ఎన్నికల ఫలితాలపై ఓ అంచనాకు రావచ్చని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం పెంపొందించుకోవాలి

**ప్రజాశక్తి - గూడూరు టౌన్:** గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో గున్నం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రతి నెలా నాలుగవ ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన రెడ్డి కమ్యూనిటీ పేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో దశరథ రామిరెడ్డి, సనత్ కుమార్ రెడ్డి, ప్రజేందర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కృష్ణారెడ్డి, కిషోర్ రెడ్డి, అనిల్ రెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

**గూడూరు టౌన్ :** స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రగతి సేవా సంస్థ కార్యా లయం లో ఆ సంస్థ ఆధ్వర్యంలో పేద లకు ఆదివారం నిత్యా వసర సరుకు లు పంపిణీ చేశారు.


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ప్రగతి సేవా సంస్థ ప్రతినిధులు

దాత పొణకా ఆదిశేషా రెడ్డి జ్ఞాపకార్థం పొణకా మల్లికార్జున రెడ్డి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ దాతల సహకారంతో తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టా మన్నారు. దాతల సేవలు మరువలేని వన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని పెంపొం దించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 'ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ రావు, టీచర్ మామడూరు రాధయ్య, ప్రభాకర్, రాము, శివ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకి ఆహ్వాన పత్రిక అందిస్తున్న గంగమ్మ గుడి కమిటీ సభ్యులు

## గంగ జాతరకు రండి..
### కోనేటికి ఆలయ కమిటీ ఆహ్వానం

**ప్రజాశక్తి - సత్యవేడు:** సత్యవేడులో ఈ నెల 29 తేదీ బుధవారం నుండి రెండు రోజుల పాటూ నిర్వహిం చనున్న గంగ జాతర వేడుకలకు సర్వం సిద్ధం చేస్తు న్న సందర్భంగా ప్రస్తుత, స్థానిక ఎమ్మెల్యే, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోనే టి ఆదిమూలంను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి గంగమ్మ జాతర వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా కోనేటి ఆదిమూలం గంగ జాతర వేడుక, నిర్వహణ, ఏర్పాట్ల గురించి ఆలయ పెద్దలతో చర్చించారు. అనంతరం తప్పకుండా తాను సత్యవేడు గంగ జాతర వేడుకలలో పాల్గొంటానని తెలిపారు.

## బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా శేఖర్

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ:** బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా మల్లం కుప్పం శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక తిరుమల బైపాస్ రోడ్ లోని ఆ సంఘం కార్యాలయంలో సర్వసభ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నూతన అధ్యక్షులను ఏకగ్రీవంగా సభ్యులందరూ ఎన్ను కున్నారు. మిగిలిన కమిటీ సభ్యులను అధ్యక్షుడు ఆధ్వర్యంలో జూన్ 6వ తేదీ ఎన్నుకో నున్నట్లు సర్వసభ్య సమావేశంలో మెజార్టీ సభ్యులు తీర్మానించారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడిని పలువురు అభినందించారు.

## 1 నుండి హనుమజ్జయంతి ఉత్సవాలు

**ప్రజాశక్తి - తిరుమల:** జూన్ 1 వ తేదీ నుంచి 5వ తేదీ వరకు అంజనాద్రి ఆకాశ గంగ ఆలయం, జపాలి తీర్థంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఐదు రోజులు పాటు ఆకాశ గంగలో బాలాంజనేయ స్వామి, అంజనాదేవికి ప్రత్యేక అభిషేకం నిర్వహించడంతోపాటు జపాలి తీర్థంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఆకాశ గంగలోని అంజనాద్రి ఆంజనేయ ఆలయంలో హనుమత్ జయంతి సందర్భంగా ఆకాశ గంగలోని అంజనాదేవి- బాలాంజనేయ స్వామి ఆలయంలో ఈ ఐదు రోజుల పాటు ఉదయం 8.30 నుండి 10 గంటల వరకు అభిషేకం చేయనున్నారు. మొదటి రోజు జూన్ 1న మల్లెపూలు, జూన్ 2న తమలపాకులు, జూన్ 3న ఎర్ర గన్నేరు, కనకాంబరం, జూన్ 4న చామంతి, చివరి రోజైన జూన్ 5న సింధూరంతో అభిషేకం చేస్తారు. జపాలిలో ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుండి 3 గంటల మధ్య దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం నిర్వహించనున్నారు. జూన్ 1న హరికథ, జూన్ 2 న అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే సంకీర్తనలు, జూన్ 3న పురంధర దాస సంకీర్తనలు, జూన్ 4న హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారిచే భజన, జూన్ 5న అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే హరికథ గానం నిర్వహిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులచే నృత్య కార్యక్రమాలు ఉంటాయి.


విద్యార్థులకు ప్రోత్సాహక ఆర్థిక సాయం అందిస్తున్న దాత

## మండల టాపర్స్‌కు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - సత్యవేడు:**
టెన్త్, ఇంటర్‌లో మండల స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్యవేడు దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రోత్సాహక ఆర్థిక సాయం అందించారు. పదవ తరగతి టాపర్ సజ్జా మానస కార్తీక్ కిరణ్ కుమార్ కుమారుడు సజ్జా మానస కార్తీక్ 592 600కు 592 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంటర్‌లో చెంచుబాబు కుమారుడు లవిశెట్టి యస్వంతజీ వెయ్యి మార్కులకు 977 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమంగా నిలిచారు. వీరికి మన్నే శివయ్య ఒక్కొక్కరికి ఐదువేల రూపాయల ప్రోత్సాహక ఆర్థిక సాయం అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సత్యవేడు దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.


## ఆర్అండ్‌బి రోడ్డుకు మరమ్మతుల్లేవ్!

- ఆగిన బస్ సర్వీసులు - ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లి బస్సులు ఎక్కాల్సిన దుస్థితి
- ప్రయాణికులు, విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం

**ప్రజాశక్తి- తిరుపతి డెస్క్:**
కెవిబిపురం మండలంలోని మారుమూల ప్రాంతమైన కోట మంగాపురం రోడ్డు గత ఏడాది కురిసిన తుపానుకు రోడ్డు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెళ్లడానికి దారి లేక పడరాని పాట్లు పడుతున్నారు. వాహనచోదకులు రాత్రి వేళలో వెళ్లాలంటే ఎప్పుడు ఏ పరిస్థితి ఎదురవుతుందో తెలియక భయం గుప్పెట్లో పెట్టుకుని పొలాలపై వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే రోడ్డు లేకపోవడంతో బస్సులు రాక సుమారు ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లి పుత్తూరుకు బస్సు ఎక్కాల్సిన దుస్థితి గ్రామంలో నెలకొంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఏమాత్రం పట్టించు కోవడం లేదని విద్యార్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జి ఏర్పాటు చేసి తమ గ్రామానికి బస్సు వచ్చేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గూడూరులో బెట్టింగుల జోరు!

- ఎన్నికల్లో గెలుపుపై రూ. కోట్లల్లో పందేలు



**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** ఎన్నికల పోలింగ్ సమరం ముగిసింది.. ఓటరు తీర్పు ఈవీఎంలలో భద్రంగా దాగి వుంది. ఎన్నికల ఫలితాల లెక్కింపు సమీపిస్తోంది. ఈ తరుణంలో నియోజకవర్గాల్లో గెలుపులపై బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. డబ్బులు కట్టలు కుమ్మరి స్తున్నారు. గూడూరు నియోజక వర్గంలో కోట్లల్లో బెట్టింగు లు నడుస్తున్నట్లు రాజకీయ వర్గాలలో చర్చ సాగుతోంది. ఇక్కడి నుంచి గూడూరు టిడిపి కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పోటీ చేయగా, వైసీపీ నుంచి మేరిగ మురళీధర్ బరిలో నిలిచారు. గూడూరు అసెంబ్లీ నుంచి హేమాహేమీలు తల పడటంతో ఎన్నికల ఫలితంపై ఉత్కంఠ కొనసాగుతోంది. దీంతో గూడూరు అడ్డాగా బెట్టింగులు ఊపందుకున్నాయి.

**బెట్టింగుల జోరు!**

ఎన్నికల ఓట్ల లెక్కింపు సమీపిస్తుండడంతో 'కాయ్ రాజా కాయ్' అంటూ బెట్టింగ్ రాయుళ్ల పందేలు కాస్తున్నారు. మార్కెట్‌లో దూకుడు పెంచి పలు రకాలుగా గెలుపు ఓటములపై బెట్టింగులు భారీగా నడిపిస్తున్నారు. గూడూరులో గెలిచేదెవరు? అనే దానిపై ఇప్పటికే పెద్ద ఎత్తున బెట్టింగులు వేసినట్లు సమాచారం. ఆయా రాజకీయ పార్టీల నాయకులతో పాటు వివిధ రకాల వ్యాపారులు బెట్టింగులు వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఇప్పటికే గూడూరు నియోజకవర్గంలో రూ.3 కోట్లకు పైగానే బెట్టింగులు నడిచినట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. గూడూరు పట్టణంలో ఎక్కడ చూసినా టీములుగా ఏర్పడి ఈ బెట్టింగులను వేస్తున్నట్లు చర్చించు కుంటున్నారు. గూడూరు మండలంలో టిడిపికి ఇంత మెజారిటీ వస్తుందని ఓ గ్రూపు.. వైసిపికి మెజారిటీ వస్తుందని మరో గ్రూపు కోటి రూపాయలు వరకు బెట్టింగులు వేసినట్లు తెలిసింది. గూడూరు టౌన్ మెజార్టీపై కూడా టిడిపి, వైసిపి నాయకులు ఇప్పటికే రూ.రెండు కోట్ల వరకు బెట్టింగులు పాల్పడినట్లు సమాచారం.

**ప్రభుత్వం పైనా బెట్టింగుల జోరు...**

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వస్తుందనే దానిపైనా గూడూరు నియోజకవర్గంలో బెట్టింగులు జోరుగా నడుస్తున్నాయి. టిడిపి ప్రభుత్వం వస్తుందని కొందరు, వైసిపి ప్రభుత్వం వస్తుందని కొందరు బెట్టింగులు వేసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే కొందరు టిడిపి నాయకులు కోట్ల రూపాయలు పైనే బెట్టింగులు వేసినట్లు రాజకీయ వర్గాలలో చర్చ సాగుతోంది. కొందరు వైసీపీ నాయకులు టీములుగా ఏర్పడి ప్రభుత్వం ఏర్పాటుపై బెట్టింగులు వేస్తున్న ట్లు చర్చించుకుంటున్నారు.

# దాహం..దాహం..!

- తిమ్మ గోపాలపురంలో తాగునీటి సమస్య
- మండుటెండలో కిలోమీటరు దూరం వెళ్లాల్సిన దుస్థితి
- స్పందించని అధికారులు

**ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ:** మండలంలోని చివరి పంచాయతీ అయిన తిమ్మ గోపాలపురం (టీవీ పురం) అరుంధతి వాడకు చెందిన దళితులు తాగునీరు లేక చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని, మంచి నీటి కోసం వెళ్లాలంటే ఒక కిలో మీటరు దూరంలో ఉన్న క్వారీల గుంతల్లో నీళ్ల తీసుకురావాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే వారిని ఆదుకునే దిక్కే లేదని, మండుటెండలో కిలోమీటరు దూరం వెళితే కాని తాగడానికి గుక్కెడు నీళ్ల కూడా దొరకడం లేదని తిమ్మ గోపాలపురం అరుంధతి వాడ మహిళలు అధికారులకు విన్నవించుకుంటున్నారు. మండలానికి ఆ గ్రామం చాలా దూరంగా ఉండటంతో వీఆర్వోలు కాని, అధికారులు కాకి తమ గ్రామం వైపు వెళ్లే పరిస్థితి లేదని ఈ కారణంగా వారిని తమ సమస్య తెలియడం లేదని పేర్కొన్నారు. గ్రామం దూరంగా వున్న కారణంగా ఏ సమస్య వచ్చినా తమ గురించి పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మా దళిత వాడకు తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


మండు టెండలో కిలో మీటరు దూరం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్న టివిపురం అరుంధతి వాడ వాసులు

# ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసు: సిఐ

**ప్రజాశక్తి- రేణిగుంట:** ఎన్నికల ఫలితాల లెక్కింపు సమీపిస్తున్న దృష్ట్యా ఎన్నికల్ కోడ్‌ను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిఐ మల్లికార్జున హెచ్చరించారు. కౌంటింగ్ సమీపిస్తున్న దృష్ట్యా ఎస్‌పి వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా నిలువరించాలనే ముఖ్య ఉద్దేశంతో ఎస్‌పి వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట మండలంలోని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పోలీసులు మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ మల్లికార్జున ఆధ్వర్యంలో సుబ్బయ్య గుంట, కుమ్మరపల్లి, ఆర్.మల్లవరం, కృష్ణాపురం తదితర సమస్యాత్మక గ్రామాలు, గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ సునీల్ ఆధ్వర్యంలో గాజుల మండ్యం గ్రామం, అత్తూరు, అల్లి కశం సమస్యాత్మక గ్రామాలలో స్థానికులతో సమావేశమై జూన్ 4 వ తేదీ వరకు ఎలక్షన్ కోడ్ తో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట అర్బన్, గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


రేణిగుంటలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

# సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ఆర్‌బిఐ

- కార్పొరేట్ రంగాలకు ఊడిగం
- జెవి సత్యనారాయణమూర్తి

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ :** సహకార బ్యాంకింగ్ వ్యవస్థను ఆర్‌బిఐ నిర్వీర్యం చేస్తోందని వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జెవి సత్య నారాయణ మూర్తి పేర్కొన్నారు. కేవలం కార్పొరేట్ బ్యాంకింగ్ వ్యవస్థకు, కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడే నిర్ణయాలు చేస్తోందని విమర్శించారు. ఆదివారం సాయంత్రం తిరుపతి బైరాగి పట్టెడ లోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్‌లో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ తిరుపతి బ్రాంచి సభ్యుల మహాసభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథులుగా హాజరైన బ్యాంక్ ఇన్‌ఛార్జి డైరెక్టర్లు నారాయణస్వామి, జే వి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సహకార రంగంతోనే సామాన్యుల జీవన ప్రమాణం మెరుగుపడుతుందని, అలాంటి వ్యవస్థను ప్రోత్సహించకుండా నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ఆర్‌బిఐ నిర్ణయాలు చేస్తోందని జెవి సత్యనారాయణమూర్తి అన్నారు. ఆర్‌బిఐ పుట్టకముందే సహకార వ్యవస్థ ఏర్పడిందని, ప్రజల డిపాజిట్‌లతో సహకార బ్యాంకులు అభివృద్ధి చెందిన పరిస్థితి వుందన్నారు. దేశంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని, అర్హతకు తగ్గ ఉపాధి అవకాశాలు లేవని సహకార బ్యాంకుల వ్యవస్థ పై ఆర్‌బిఐ నియంత్రణ ఎక్కువైందని మండి పడ్డారు. కార్పొరేట్ బ్యాంకులకు ఆర్‌బిఐ ఊడిగం చేస్తోందన్నారు. జాతీయ బ్యాంకులు బడా కార్పొరేట్ వ్యవస్థలకు రుణాలు ఇస్తున్నా యని అయితే సహకార బ్యాంకులో సామాన్యుడికి రుణాలు ఇచ్చి సహకరిస్తు న్నాయన్నారు. బంగారంపై లోన్లు ఇవ్వడంలో సహకార బ్యాంకులు ముందు వరుసలో ఉన్నాయన్నారు. వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 40 శాతం రుణాలు బంగారు పై ఇస్తారని పేర్కొన్నారు. రెండు లక్షల వరకు బంగారు రుణాలు ఇవ్వాలని సహకార బ్యాంకులకు ఆంక్షలు విధించారని, అదే జాతీయ బ్యాంకుల విషయంలో నియంత్రణ లేకుండా ఆర్‌బిఐ వ్యవహరిస్తోందన్నారు. 10 లక్షల రూపాయల వరకు బంగారం రుణాల పై పరిమితి ఉంచాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. కేవలం నాలుగు లక్షల వరకు మాత్రమే ఇవ్వాలని అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. సామాన్య ప్రజలు సొంత ఇంటి కోసం స్థలం కొనుగోలు చేస్తే దాని కోసం ఇచ్చే రుణాలపై నియంత్రణ పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వ్యవసాయ పంటలకు రుణాలు ఇవ్వడానికి వీలు లేకుండా చేశారన్నారు. సహకార లేకుంటే మానవ మనుగడ లేదన్నారు. సహకార వ్యవస్థ తోనే సామాన్య ప్రజల స్థితి గతులు మెరుగు అవుతుందని, సహకార బ్యాంకుల లో ప్రతి పైసా ప్రతి సభ్యుడికి హక్కు వుంటుందన్నారు. ఆదాయ పన్ను విషయం లో కార్పొరేట్ బ్యాంకులకు తక్కువ స్థాయి లోనూ, సహకార బ్యాంకుల కు ఎక్కువ స్థాయిలో విధించిందన్నారు. సహకార బ్యాంకింగ్ వ్యవస్థ లోని అందరి పోరాట ఫలితంగా ఆదాయ పన్ను 25 శాతానికి తగ్గించిందన్నారు. వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సభ్యులుగా ఉన్న వారి పిల్లలు చదువులకు, మరణించిన సభ్యుల వారసులకు సంక్షేమ నిధి నుండి డబ్బులు ఇస్తున్నామని తెలిపారు. గత సంవత్సరం 5.5 కోట్ల రూపాయలు బ్యాంకు సభ్యుల సంక్షేమానికి కేటాయించారని పేర్కొన్నారు. సభ్యుల ఆరోగ్య బీమాను స్వతహాగా నిర్వహించుకోవడానికి వున్న అవకాశాల్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. బ్యాంకు సభ్యుల సంఖ్యతో పాటు షేర్ లు పెంచుకోవాలని కోరారు. దేశంలో ఉన్న సహకార బ్యాంకు లలో వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ నాలుగవ స్థానంలో నిలిచిందన్నారు. దీన్ని మరింత అభివృద్ధి చేయడానికి సభ్యులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో బ్యాంక్ జోనల్ మేనేజర్ వెంకటేశు, బ్రాంచ్ మేనేజర్ సునీత, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జెవి సత్యనారాయణమూర్తి


## సర్వమానవ సమానత్వమే అన్నమయ్య ప్రబోధం : డాక్టర్ ఆర్‌వి కుమార్

**ప్రజాశక్తి - క్యాంపస్ :** అన్నమాచార్యులు తన సంకీర్తనల్లో సర్వమానవ సమానత్వాన్ని ప్రబోధించారని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్ పేర్కొన్నారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలోని అన్నమాచార్య కళా మందిరంలో నిర్వహిస్తున్న సాహితీ సదస్సులు ఆదివారం మూడవ రోజుకు చేరుకున్నాయి. సదస్సుకు అధ్యక్షత వహించిన డాక్టర్ ఆర్‌వి కుమార్ 'అన్నమయ్య – యోగ సంకీర్తనలు ' అనే అంశంపై ఉపన్యసిస్తూ, ప్రసిద్ధ శ్రీవైష్ణవాచార్యులు భగవద్ రామానుజులు తెలిపిన అష్టాక్షరి మంత్రాన్ని అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా శ్రీ వైష్ణవ ధర్మాన్ని, భక్తి తత్వాన్ని ప్రచారం చేసినట్టు తెలిపారు. అన్నమయ్య యోగ సంకీర్తనల ద్వారా ధర్మ, భక్తి, శరణాగతి, అహింస ప్రధానంగా ఉన్నాయన్నారు. ఎస్వీ యూనివర్సిటి విశ్రాంత ఆచార్యులు డాక్టరు సర్వోత్తమరావు 'అన్నమయ్య – శ్రీనివాసుని అభిషేక సంకీర్తనలు' అనే అంశంపై మాట్లాడుతూ తిరుమల వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగే అభిషేకం శుక్రవారం ఎందుకు నిర్వహిస్తారో వివరించారు. ఆ సందర్భంలో జరిగే కైంకర్యాలు కూలంకషంగా వివరించారు. వేంకట శంకర భగవాన్ 'అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.– ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డా. విభీషణ శర్మ, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# కొండెక్కిన కోడి ధర!


రూ.260 నుండి 300 వరకు

**ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ:** బుచ్చినాయుడు కండ్రిగ మండ లం లో కోడి మాంసానికి గిరాకీ బాగా పెరిగింది. చికెన్ ధరలు ఎండలతో పాటు మండి పోతుండ టంతో ప్రజలు కొనుగోలు చేసేందుకు భయపడు తున్నారని పలువురు విక్రయదారులు వాపో తున్నారు. గతంలో కిలో మాంసం ధర 200 రూపాయల లోపు ఉండేది. ప్రస్తుతం కోడి మాంసం కిలో ధర రూ.260 నుండి 280 వరకు పలుకుతోంది. గతంలో ఎప్పుడూ ఇంత ధరలు లేకపోవడం ఇప్పుడు ఉన్నట్లుండి ఒక్క సారిగా కోడి మాంసం ధరలు భారీ స్థాయిలో పెరగడంతో కొనుగోలుదారులు కోడి మాంసం ధరలు కొండెక్కా యని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడి మాంసాన్ని అన్ని రాజకీయ పార్టీ నాయకులు విందుల కోసం భారీగా కొనుగోలు చేయడంతో కోళ్ల నిల్వలు బాగా తగ్గిపోయాయి. ఇంకా ఎన్నికల ఫలితాలు పది రోజులు టైం ఉంది. ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేసిన వారందరూ నిత్యం పార్టీలు చేసుకుంటుం డడంతో చికెన్‌కు డిమాండ్ విపరీతంగా పెరిగింది. కోడి ధర పెరిగిన నేపథ్యంలో సాధారణ కోళ్లను కొనుగోలు దారులు పెంచేందుకు ముందుకు రావ డం లేదు. ఈ రేటు కార్పొరేట్ శక్తుల చేతుల్లో ఉందని కొందరు దుకాణ దారులు వాపోతు న్నారు. దీనికి తోడు ఎన్నికల సందర్భంగా ప్రతి రోజూ ఏదో ఒక గ్రామంలో కోడి మాంసంతో భోజనాలు అందిస్తున్నారు. కోడి మాంసంకు గిరాకీ పెరడడంతో ఒకటి 1.6 కిలోల బరువున్న కోళ్లను దుకాణాలకు తర లించారు. దీనివల్ల తీవ్ర స్థాయిలో లోటు ఏర్పడ్డాయి. సత్యవేడు నియోజక వర్గ పరిధి లోని బుచ్చినాయుడు కండ్రిగ మండల ప్రాంతంలో సుమారు 20కి పైగా చికెన్ దుకాణాలు ఉన్నాయి. నిత్యం ఒక దుకాణంలో 30 కిలోలు చొప్పున మాంసం విక్రయిస్తుంటారు. ఒక్క ఆదివారం మాత్రం ఒక్కో దుకాణం నుంచి వందల కిలోల మాంసం అమ్ముడు పోతుంది. చికెన్ ధరలు అందుబాటులో లేక పోవడంతో కొనుగోలు దారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ అధిక ధరలు వెంటనే తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విక్రయ దారులు, కొను గోలు దారులు కోరుకుంటున్నారు.



# క్రైం న్యూస్

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రజ్ఞ

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన వడమాలపేట మండలంలో ఆదివారం చోటు చేసు కుంది. వడమాల పేట మండల పరిధిలోని పాదిరేడు బైపాస్ రోడ్డు వద్ద మోటార్ బైక్ ను కంటైనర్ ఢీ కొనడంతో తమిళనాడు కు చెందిన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. తమిళనాడు, తిరువళ్లూరు జిల్లా, పొన్నేరు కు చెందిన ప్రజ్ఞ (35) ప్రమాదంలో మృతి చెందింది. శనివారం తిరుమలకు వెంకటేశ్వర స్వామి దర్శనార్థం పొన్నేరికి చెందిన విజయకాంత్, ప్రజ్ఞ దంపతులు శ్రీవారిని దర్శించి ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి వెళుతుండగా పాదిరేడు బైపాస్ వద్ద వెనుక వస్తున్న కంటైనర్ ఢీ కొంది. దీంతో అదుపుతప్పి మోటారబైక్ బోల్తా పడడంతో ప్రజ్ఞ అక్కడికక్కడే మృతి చెందింది. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐధర్మారెడ్డి తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో దెబ్బతిన్న చెరుకు బండిని పరిశీలిస్తున్న పోలీసులు

## చెరుకు జ్యూస్ బండిని ఢీకొన్న ద్విచక్ర వాహనం
### ఇద్దరికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి -రేణిగుంట:** చెరుకు జ్యూస్ బండిని ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో జ్యూస్ బండి యజమానితో పాటూ ద్విచక్రవాహన దారుడు తీవ్రంగా గాయపడిన సంఘటన రేణిగుంట మండలంలో రేణిగుంట -తిరుపతి ఫ్లై ఓవర్ పై ఆదివారం చోటు చేసుకుంది. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు..తిరుపతి నుండి చెరుకు బండి జ్యూస్ అమ్ముకొని తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనదారుడు వెనుక నుండి చెరుకు బండిని ఢీకున్నాడు. చెరుకు బండి బోల్తా పడడంతో చెరుకు బండి బాగా దెబ్బతింది. ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు అయ్యింది. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. చెరుకు బండి జ్యూస్ అమ్మే వ్యక్తిని నారాయణ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా ద్విచక్ర వాహనదారుడిని ఆటోలో తిరుపతి ఆస్పత్రికి స్థానికులు తీసుకు వెళ్లారని తెలిపారు. చెరుకుబండిలో చెరకు ఫ్లై ఓవర్‌పై చిందవందరగా పడడంతో కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనంతరం పోలీసులు రోడ్డుపై పడిన వాహనాలను పక్కకి తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనం

## గంగమ్మ గుడిలో చోరీ


హుండీ చోరీకి గురైన గంగమ్మ ఆలయం

**ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ :** స్థానిక బజారు వీధిలోని గంగమ్మ ఆల యంలో శనివా రం అర్ధరాత్రి గుర్తు తెలి యని వ్యక్తులు దేవాల య తాళాలు పగల కొట్టి హుం డీని అపహరిం చుకుని వెళ్లినట్లు స్థాని కులు గుర్తించారు. బజారు వీధిలో నిత్యం రద్దీ ఉన్న ప్రాంతంలో ఇలా జరగడం స్థాని కులను కలవర పరు స్తోంది. పోలీ సులు గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఇలా జరగడం ప్రజల్లో చర్చనీయాంశం గా మారిం ది.

## ఘనంగా నాగరప్పమ్మ తిరునాళ్లు

**ప్రజాశక్తి - ఓజిలి :** ఓజిలి గ్రామంలో వెలిసిన నాగరప్పమ్మ ఆలయ తిరునాళ్లు ఘనంగా కొనసాగుతున్నాయి. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తిరునాళ్ల సందర్భంగా మహిళలు అంబళ్లు, పొంగళ్ళు నైవేద్యంగా పంచామృతం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, యువత, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 4న ప్రజా ప్రభుత్వం
### టిడిపి నేత బోండా ఉమామహేశ్వరరావు

**ప్రజాశక్తి -తిరుమల:** జూన్ 4వ తేదీ ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అన్ని రంగాలను గాడిన పెట్టాల్సిన అవసరం ఉందని టీడీపీ నేత బోండా ఉమ అన్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో గర్భాలయంలోని స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. దర్శన అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానంను రాజకీయంగా వైసిపి అనేక రకాలుగా వాడుకుందని, సిఎం జగన్ ఐదు సంవత్సరాల పాలనలో ఒకసారైనా శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించ లేదని ఆరోపించారు.